క్లుప్తంగా

ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కంచికచర్ల: మండలంలోని పరిటాల అమృతసాయి ఇంజినీరింగ్ కళాశాలలో చైన్నెకు చెందిన ప్రముఖ కంపెనీ యమహా మోటార్స్ ఎలక్ట్రానిక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధులు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారని కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పీ చిరంజీవి శనివారం తెలిపారు. ఆటో మొబైల్ రంగంలో అతి పెద్దదైన కంపెనీ లిమిటెడ్ బీటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థినులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, టెక్నికల్, హెచ్ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో ప్రతిభ కనపర్చిన 11 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.2–6 లక్షలు నిర్ణయించి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కే రామ్మోహన్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.12.17 లక్షల ఆదాయం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ ప్రాంగణంలో వివిధ వ్యాపారాలు చేసుకునే దుకాణాల నిర్వహణ హక్కులకు శనివారం ఆలయ బేడా మండపంలో నిర్వహించిన టెండర్–కం–బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.12,17,850 ఆదాయం వచ్చినట్లు ఈఓ లీలాకుమార్ తెలిపారు. మొత్తం 22 దుకాణాలకు నిర్వహించిన వేలం ద్వారా ఈఆదాయం సమకూరిందన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, దేవదాయశాఖ నందిగామ డివిజన్ తనిఖీదారు అనురాధ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నందిగామ: సంకటహర చతుర్థి నేపథ్యంలో శనివారం మండలంలోని పలు గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణంలోని పాత బస్టాండ్‌లో వద్ద పురాతన గణపతి ఆలయంలో, కాకులయ్య వీధిలోని విగ్నేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలతో పాటు విశేష పూజలు నిర్వహించారు. రామలింగేశ్వర నగర్‌లోని గణపతి ఆలయంలో విశేష పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. మండలంలోని పలు దేవాలయాల్లో సంకటహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పిల్లలను రోజూ గమనించాలి



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం జలజ

పెనుగంచిప్రోలు: పిల్లలను తల్లిదండ్రులు రోజూ గమనిస్తూ ఉండాలని హెచ్ఎం కె.జలజ తెలిపారు. ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరవ్వాలన్నారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. మోడల్ పరీక్షా పత్రాలను తరుచూ విద్యార్థులు రివ్యూ చేసుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ ఉడికించిన శనగలు, గోధుమరవ్వ జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక సౌజన్యంతో అందిస్తున్నామన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తుల వెంకటనర్సు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్‌ల పంపిణీ

నందిగామ: పట్టణంలోని ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంలో పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు శనివారం పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. ఏజీపీ మట్టా ప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో దైవ సేవకులు రాజారావు, సత్యపాల్, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను కించపరిచేలా లోకేష్ వ్యాఖ్యలు

- కృష్ణా జిల్లా వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు శ్రీనివాసరావు

జగ్గయ్యపేట అర్బన్: మదనపల్లిలో గురువారం జరిగిన యువగళం కార్యక్రమంలో రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిని అసభ్య పదజాలంతో నారా లోకేష్ మాట్లాడటం ద్వారా యావత్ బీసీ, చేనేత వర్గాలను కించపరచారని వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం లోకేష్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇటీవలే నూతనంగా ఆప్కో చైర్మన్‌గా, రాష్ట్ర చేనేత విభాగానికి అధ్యక్షుడిగా గంజి చిరంజీవిని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియమించిన విషయం విధితమే. లోకేష్ మాటలు రాజకీయ పరిజ్ఞానం బొత్తిగా లేని వ్యక్తి మాట్లాడుతున్నట్లుగా బీసీల మనోభావాలను అవమానపరిచే విధంగా ఉన్నాయని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో మంగళగిరిలో 50 వేల ఓట్ల తేడాతో ఓటమి చవిచూడటం ఖాయం అని తెలిసి, మతి స్థిమితం కోల్పోయిన లోకేష్ ఎప్పుడు ఏం మాట్లాడతాడో అర్థం కాని స్థితికి చేరుకున్నాడని అన్నారు. గంజి చిరంజీవికి, బీసీ సోదరులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

వరాహ వేదన

- 100కు పైగా పందులు మృతి
- కారణం తెలియక పెంపకందారుల ఆందోళన
- పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో ప్రజలు



మృత్యువాత పడుతున్న పందులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో అకస్మాత్తుగా పందులు మృతి చెందుతున్నాయి. గత వారం రోజుల్లో 100 పైగా పందులు మృత్యువాత పడినట్లు పందుల పెంపకం దారులు అంటున్నారు. అప్పటి దాకా బాగున్న పందులు కూడా అప్పటికప్పుడే కిందపడి మృతి చెందుతున్నాయి. దీంతో పెంపకం దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామంలో మునేరు కాజ్‌వే పక్కన, అమ్మవారి ఆలయ సమీపంలో నాటు పందులు వందల సంఖ్యలో ఉన్నాయి. వీటికి పెంపకం దారులు తోటల్లో భక్తులు వదిలి వేసిన అన్నం, సాంబారు, కూరలు, బిరియానీ అందిస్తారు. కాజ్‌వే పక్కన చికెన్ దుకాణదారులు పడేసిన వ్యర్థాలు ఆహారంగా ఇస్తారు. కొన్ని పందులు సాయంత్రానికి పెంపకం దారుల వద్దకు చేరుకోగా, కొన్ని మునేరు పక్కనే ఉంటున్నాయి. పంచాయతీ అధికారులు ఎన్నిమార్లు చెప్పినా కోళ్ల దుకాణ యజమానులు మునేరు పక్కనే వ్యర్థాలు వేయటం వలన పందులు అక్కడ ఎక్కువగా నివాసం ఉంటున్నాయి. ఇక్కడ నిత్యం ప్రజల రద్దీ ఉంటుంది.

భయంతో వణికి పోతున్న ప్రజలు..

నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలతో పాటు, తిరునాళ్ల ఉత్సవాల సమయంలో పందుల మృతితో ప్రజలు వణికి పోతున్నారు. పెద్ద సంఖ్యలో పందులు మృతి చెందటంతో తమకు ఎలాంటి వ్యాధులు వస్తాయో అని ప్రజలు భయపడుతున్నారు. ప్రజలు ఇబ్బంది లేకుండా చనిపోయిన పందులను పంచాయతీ వారు జేసీబీతో గుంట తీసి పూడుస్తున్నారు. సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా మండల స్థాయి అధికారుల్లో చలనం లేకపోవడంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

శాంపిల్స్ ఇచ్చి సహకరించాలి..



పందుల మృతి మా దృష్టి వచ్చింది. అయితే మృతి చెందిన శాంపిల్స్ ల్యాబ్‌కు పంపిస్తే ఏకారణం చేత మృతి చెందుతున్నాయో అర్థమవుతుంది. వైరస్ లక్షణాలు వలన మరణిస్తున్నాయని భావిస్తున్నాం. పెంపకం దారులను శాంపిల్స్ ఇచ్చేందుకు సహకరించమంటే మావి నాటు పందులు ఎక్కడెక్కడో తిరిగి సాయంత్రానికి మావద్దకు వస్తాయని అంటున్నారు. కలుషితమైన నీరు, పులిసిన ఆహారాన్ని ఇవ్వొద్దని చెప్పాం.

– అనిల్, పశువైద్యాధికారి

అమ్మవారికి బోనాల సమర్పణ



భక్తులకు ప్రసాదాన్ని అందిస్తున్న ఆర్యవైశ్య సంఘ పెద్దలు

వత్సవాయి: గ్రామంలో రామ జగపతి దేవసమేత శ్రీ వత్సవాయమ్మ తల్లి ఆలయానికి శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. తిరునాళ్ల చివరి రోజున ఉన్నవూరు బోనాలను భక్తులు అమ్మవారికి సమర్పించుకున్నారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై ప్రభలను కట్టుకొని వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. రైతులు తమ పంటలను అమ్మవారి దగ్గర పెట్టి మొక్కు తీర్చుకున్నారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు ఈవో సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు చెప్పారు. గ్రామానికి చెందిన శ్రీవాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, రవ్వకేసరి, మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉత్సవ నిర్వాహక దాత గుత్తా కృష్ణమూర్తి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొగ్గవరపు వెంకటరాజారావు, దుగ్గి ఈశ్వరరావు, తొండపు కిషోర్, మద్దు హరిబాబు, యర్రా శ్రీను, కొత్తా ఆదిలక్ష్మి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఏసీపీ



ఉత్సాహంగా క్రికెట్ ఆడుతున్న పోలీస్ జట్లు

నందిగామ: క్రీడల వలన ఎన్నో ప్రయోజనాలున్నాయని ఏసీపీ నాగేశ్వరరెడ్డి అన్నారు. నందిగామ డివిజన్ పరిధిలో పోలీస్ జట్లకు రెండు రోజులపాటు నిర్వహించనున్న 'టీజోల కప్–2023' క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన ఈ పోటీలను ఏసీపీ ప్రారంభించారు. ఈ పోటీలలో డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడితో హడావిడిగా ఉండే పోలీసు సిబ్బందికి క్రీడల వలన మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్ఓ సతీష్, డివిజన్ పరిధిలో పలు స్థాయిల్లో ఉన్న పోలీస్ సిబ్బంది ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.

ఫిర్యాదులు రాకుండా పని చేయాలి

సచివాలయ సిబ్బందికి ఎమ్మెల్యే జగన్‌మోహనరావు సూచన



సచివాలయ సిబ్బంది పనితీరు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కీసర(కంచికచర్ల): మండలంలోని కీసర గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ప్రజా ప్రతినిధులు, నాయకులతో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు సమావేశం నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయ సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో సచివాలయం, విలేజ్ వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణానికి రూ.79.30 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. ఆ నిధులతో మూడు భవన నిర్మాణపనులు త్వరితగతిన చేపట్టాలని ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. గ్రామ సచివాలయం ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు వ్యవసాయ సాగుకు అవసరమైన మెలకువలు, పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, వ్యవసాయ పనిముట్లు రాయితీతో రైతులకు అందించటం జరుగుతుందన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం వెల్‌నెస్ సెంటర్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆ మూడు భవన నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని బిల్లులు కూడా సకాలంలో ప్రభుత్వం నుంచి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు..

బియ్యం కార్డు, పింఛన్, అమ్మఒడి పథకం, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలన్నీ అర్హులకు సచివాలయ సిబ్బంది అందించాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే గ్రామ సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన..

అంతకుముందు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు పరిశీలించారు. చిన్నారులకు బోధన చేయటంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలకు కూడా మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని ప్రతిరోజు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచి పీ నర్సమ్మ, వైఎస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, ఎంపీటీసీ సభ్యులు పాపట్ల సీత, నాయకులు పరిటాల రాము, వేల్పుల రమేష్, పాపట్ల స్వామి, చలమల ప్రభాకర్, ఎంపీడీఓ కే బాలశంకరరావు, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు



నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నందిగామ: పట్టణంలోని చందర్లపాడు రోడ్డు రహదారి విస్తరణ సందర్భంగా పాత విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన విద్యుత్తు లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం పట్టణంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు కొనసాగాయి. దీనిపై ఆ శాఖ ఏఈ దిబ్బయ్య మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో మిగిలిన పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

వీరులపాడు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రభుత్వ మెనూ ప్రకారం బలవర్ధక ఆహారం అందించాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని దొడ్డదేవరపాడు, వీఅన్నవరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందించే ఆహారాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

నందిగామ: మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. విషజ్వరాలు వ్యాపిస్తున్న నేపథ్యంలో గ్రామంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఈ సంకల్పంతో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు సర్పంచ్ పల్లెకంటి అరుణ కుమారి తెలిపారు. పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలన్నారు.

సమాజానికి సేవ చేసే అవకాశం రావడం అదృష్టం

వైఎస్సార్ సీపీ నేత వెంకటకృష్ణ ప్రసాద్



విద్యాసామగ్రి అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత వెంకటకృష్ణ ప్రసాద్, పాస్టర్లు

జగ్గయ్యపేట అర్బన్: సమాజానికి సేవ చేసే అవకాశం రావడం అదృష్టమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక డాంగేనగర్‌లో ఫిలజ్జోనియా గాస్పెల్ సొసైటీ ఆధ్వర్యంలో బి.సత్యపాల్, వై.రాజశేఖర్ నేతృత్వంలో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు సామినేని వెంకట కృష్ణప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలన్నారు. సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మారుస్తూ విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారని తెలిపారు. ఏప్రిల్ నెలలో పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులందరూ చదువుపై దృష్టి సారించి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్ష వెలిబుచ్చారు.

31లోగా పన్నులు చెల్లించండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 31వ తేదీతో ఆర్థిక సంవత్సరం ముగియనున్న దృష్ట్యా జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలో 2022–23 సంవత్సరానికి ఆస్తి పన్నులు, నీటి కుళాయి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ శివకోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలంతా తమ పన్నులు సకాలంతో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని సూచించారు. పన్నులు చెల్లించని వారి నీటి కనెక్షన్ నిలిపివేస్తామన్నారు. వారిపై మున్సిపల్ చట్ట ప్రకారం కోర్టులో సివిల్ దావాలు వేయనున్నట్లు తెలిపారు. ఈనెల ఆఖరు వరకు అన్ని శెలవు రోజుల్లో పన్నులు చెల్లించవచ్చని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ విధానాలపై ఉద్యమించండి

సీపీఎం జిల్లా కార్యదర్శి కృష్ణ



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కృష్ణ

జగ్గయ్యపేట అర్బన్: బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని జిల్లా సీపీఎం కార్యదర్శి డీవీ.కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక డీవీఆర్ నగర్‌లోని సుందరయ్య భవన్‌లో మండల సీపీఎం పార్టీ సభ్యులు, సానుభూతి పరులు, ప్రజా సంఘాల సభ్యులతో పార్టీ సీనియర్ నాయకుడు కోట కృష్ణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీవీ.కృష్ణ మాట్లాడుతూ కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ వలన పేద ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి పేద వర్గాలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఇటీవల గ్యాస్ ధర పెంచి ఏడాదికి రూ 3.50 లక్షల కోట్లు భారం మోపిందన్నారు. రానున్న కాలం ఉద్యమాల కాలం అయినందున ప్రజలంతా ఈ ఉద్యమాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పార్టీ పేట పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి, సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు, దంతాల వెంకటేశ్వర్లు, కాకనబోయిన లింగారావు, నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, సానుభూతి పరులు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపులకు 42 గొర్రెల పంపిణీ

నందిగామ: మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామంలో స్వయం సహాయక సంఘాలకు శనివారం గొర్రెలు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ పల్లెకంటి అరుణ కుమారి గ్రామంలోని ఏడు స్వయం సహాయక సంఘాలకు 42 గొర్రెలను పంపిణీ చేశారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఇబ్రహీంపట్నం: ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ 2022–23 పోటీలకు తమ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని జాకీర్ హుస్సేన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మహబూషా శనివారం తెలిపారు. కృష్ణా వర్సిటీ జట్టు తరఫున విద్యార్థులు ప్రాతినిధ్యం వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. పంజాబ్‌లోని చండీఘర్ యూనివర్సిటీలో ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు జరిగే పోటీల్లో 70 యూనివర్సిటీలకు చెందిన జట్లు పాల్గొంటాయన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. జట్టు మేనేజర్ లీలావాణి, కోచ్‌గా రాజశేఖర్ వ్యవహరిస్తారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్‌సాధిక్ అధ్యాపకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎస్ఐ మూర్తి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మొబైల్‌ఫోన్, కంప్యూటర్, నెట్ వాడకంపై అవగాహన లేమితో చిన్నారులు సైబర్ ప్రమాదాల బారిన పడుతున్నారని, వారిని రక్షించడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యతని ఎన్టీఆర్ జిల్లా సైబర్ పోలీసు స్టేషన్ ఎస్ఐ ఏ మూర్తి పేర్కొన్నారు. హనుమాన్ పేటలోని తానా భవన్‌లో చైల్డ్ లైన్–1098, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ వారి సహకారంతో సైబర్ క్రైమ్‌పై అవగాహన, ఆన్‌లైన్ సేఫ్టీ ఫర్ చిల్డ్రన్ అనే అంశంపై వర్క్ షాపు జరిగింది. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ చైల్డ్ లైన్–1098 సభ్యులు ఈ సైబర్ నేరాలపై, ఆన్‌లైన్ సేఫ్టీ పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. తద్వారా బాలలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. సైబర్ నేరాలు 27 రకాలు ఉన్నాయన్నారు.

అపరిచుతులతో, అపరిచిత యాప్స్‌తో, ఈ–మెయిల్స్‌తో, ఓటీపీలతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. బాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై పెద్దలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ సమాజ పటిష్టతకు మూలమన్నారు. చైల్డ్ లైన్ కో–ఆర్డినేటర్ అరవ రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా సైబర్ నేరాలతో ప్రమాదంలో ఉన్నామన్నారు. ముఖ్యంగా బాలలు అవగాహన లేక కొన్నిసార్లు ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారని తెలిపారు. ఆన్‌లైన్ సైబర్ మోసాలతో చాలా మంది జీవితాలను కోల్పోతున్నారన్నారు. సైబర్ నేరాలపై చిన్నారులకు సరైన అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అవగాహన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ సెంటర్ కో–ఆర్డినేటర్ నాగరాజు, రైల్వే చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ వరప్రసాద్, ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ కార్యదర్శిగా చారి

తిరువూరు: ఏపీ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా శాఖ కార్యదర్శిగా తిరువూరు గీతమ్స్ స్కూల్ కరస్పాండెంట్ ఎస్ఎస్‌బీ చారి ఎన్నికయ్యారు. నూజివీడులో శనివారం జరిగిన కార్యవర్గ ఎన్నికలో చారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసోసియేషన్ చైర్మన్ మోహనరావు తెలిపారు.

మొక్కల సంరక్షణకు విరాళం

ముసునూరు: వృక్షో రక్షతి రక్షితః అంటూ ఓ చిరు వ్యాపారి వృక్షాలపై తనకున్న మమకారంతో మొక్కలు నాటి వాటి సంరక్షిస్తూ అందరి అభిమానాలు అందుకుంటున్నాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడుకు చెందిన చిర్రా బాలకృష్ణ ఆధ్యాత్మిక వాతావరణం, పర్యావరణ పరిరక్షణకై స్థానిక కోదండ రామాలయ ప్రాంగణంలో శనివారం తన కుటుంబ సభ్యులతో కలసి ఉసిరి, మారేడు, రావి, వేప మొక్కలు నాటాడు. వాటి సంరక్షణ కోసం ఏటా రూ.10 వేలు అందజేయనున్నట్లు ప్రకటించాడు.

భూ హక్కు పత్రాలతో హాజరు కావాలి



హద్దు రాళ్ల ఏర్పాటును పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ రాజకుమారి

కంచికచర్ల: రైతులు పొలాలకు భూ హక్కు పత్రంతో హాజరుకావాలని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి కోరారు. మండలంలోని పరిటాలలో శనివారం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు భూములను రీ సర్వే చేసి రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. ఖచ్చితమైన కొలుతలు, హద్దులతో భూములను రీ సర్వే చేసి హద్దు రాళ్లను పాతిస్తున్నామని రాజకుమారి అన్నారు. కొలతలు పూర్తయిన భూములకు ప్రభుత్వం అందజేసిన సరిహద్దు రాళ్లను పాతారు. స్టోన్ ప్లాంటేషన్ ఈనెల 15తేదీ లోగా పాతేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు, కౌలురైతులు తమ సిబ్బందికి సహకరించాలన్నారు. డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రాజేంద్ర ప్రసాద్, డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, సర్వేయర్ బసవరావు, వీఆర్వోలు శ్రీలక్ష్మీ, వేముల ప్రదక్షిణరావు, వేల్పుల జనార్ధన్, రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిన్నారుల బోటు షికార్



భవానీపురం(విజయవాడపశ్చిమ): చిన్నారులు బోధిసిరి బోటులో ఉల్లాసంగా, ఉత్సాహంగా నదీ విహారం చేశారు. శనివారం గుంటూరు జిల్లా దుగ్గిరాలకు చెందిన మాంటిసోరి పాఠశాల చిన్నారులు భవానీపురంలోని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖకు చెందిన బెరంపార్క్‌కు రెండు బస్సుల్లో సుమారు వంద మంది చేరుకున్నారు. బోటింగ్ పాయింట్ దగ్గరకు వెళ్లిన వారిని బోధిసిరి బోటు ఎక్కించి నదీ విహారం చేయించి ద్వీపంలోకి తీసుకెళ్లారు. ఇక చిన్నారుల ఆనందానికి అంతేముంది. ఆడుతూ పాడుతూ ఓపెన్ జిమ్‌లో హల్‌చల్ చేశారు. శని వారం సెలవు కావడంతో భవానీ ద్వీపంలో గడిపేందుకు అత్యధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. వీరికితోడు చిన్నారులుకూడా రావడంతో ద్వీపం కళకళలాడింది.